ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025 | 5





ఎమ్మెల్సీగా సోము వీర్రాజు



అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి సోము వీర్రాజును వరించింది.. బీజేపీ నుంచి ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో సోమవారం రాజధానిలో నామినేషన్ దాఖలు చేశారు. గత 2015లో ఒకసారి టీడీపీ బీజేపీ పొత్తు నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. ప్రస్తుతం కూటమితో పొత్తు నేపథ్యంలో ఈసారి ఎమ్మెల్సీ పదవి వరించింది.. దీంతో జిల్లాలో బీజేపీ బలం పెరిగింది. - మెయిన్‌లో

స్వామిని కోరుకొండ!

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.. కొండపై ఉన్న స్వామిని కొలిచేందుకు 615 మెట్లు ఎక్కి తండోపతండాలుగా భక్తజనం తరలివెళుతున్నారు.. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం స్వామి రథోత్సవం నిర్వహించారు.. పెద్ద ఎత్తున భక్తజనం గోవిందా..గోవింద అంటూ స్వామి రథాన్ని లాగారు.. రాత్రి ఆలయంలో కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై కొలిచారు.. ఓం నమో నారసింహాయ అంటూ మొక్కారు.. ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తారు. 6





సాగుతున్న రథోత్సవం.. మొక్కుతున్న భక్తజనం

ఆయువేగం!

స్పీడుగా..పోతున్నారు!

చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను అతలాకుతలం చేసేస్తోంది.. కుటుంబాలను తీరని దుఃఖంలో ముంచేస్తోంది.. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే కనురెప్పల మాటున కన్నీటిని అదిమిపెట్టుకుని జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారెందరో.. కష్టాలు తీరుస్తాడని.. తమకు అండగా ఉంటాడని.. తమను పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని ఎదురుచూస్తుంటే.. చేతికందివచ్చిన కొడుకు లేడు.. ఇక తిరిగి రాడంటే ఎంత కష్టం.. ఆ బాధను ఆపడం ఎవరితరం.. అయితే ప్రస్తుత యువత మాత్రం ఇవేమీ ఆలోచించడం లేదు.. వాయువేగంగా వెళ్లిపోతున్నారు.. 18 నుంచి 30 ఏళ్ల మధ్యే ప్రాణాలను బలిపెడుతున్నారు.. ఈ మూడు నెలల్లోనే సుమారు 75 మంది యువత మృత్యువాతపడింది. ఈ ఆయువేగానికి కారణం ఎవరు.. ముందు తల్లిదండ్రులే. స్టేటస్ పేరుతో ఎక్కువ సీసీ బైక్‌లు కొనిచ్చేస్తున్నారు.. ఉడుకురక్తం.. ఆ బైక్‌పై రయ్ రయ్‌మంటూ వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. తల్లిదండ్రులూ యువతే కాదు.. మీ పిల్లలకు తెలియజెప్పాలి. అతివేగం ప్రమాదమని హెచ్చరించాలి.



ఇక మాకు దిక్కెవరయ్యా : ప్రత్తిపాడు వద్ద ప్రమాదంలో మృతిచెందిన కుమారుడి వద్ద తల్లి రోదన



వేగం తీసిన ప్రాణాలు

నిన్న ఒక్కరోజే..

లారీని ఢీకొన్న బైక్ యువకుడు మృతి

బైక్ స్కిడ్ అయి ఇంటర్ విద్యార్థి మృతి 7



జగ్గంపేట వద్ద ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి

అమలాపురం/రాజమహేంద్రవరం/పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం జరిగితే జీవితాలు గల్లంతే. ఆ ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే అప్పటిదాకా సాఫీగా సాగిపోతున్న కుటుంబం ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ.. లేకలేక పుట్టిన కొడుకు, అల్లారుముద్దుగా పెంచుకొన్న కొడుకు, చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం జీవితాంతం దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని రోజులు వెళ్లదీయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకులు అత్యధికంగా మృత్యువాతపడ్డారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలన్నీ ఆందోళన కలిగిస్తుండగా, వీరి కుటుంబాలు గర్భశోకంతో తల్లడిల్లిపోతున్నాయి. ఈ విషాద ఘటనల్లో ఎక్కువశాతం అతివేగం లేదంటే ఏమరుపాటు కారణాలవ్వడం గమనించాల్సిన విషయం. అలాగే అత్యధిక ప్రమాదాల్లో మరణిస్తున్న యువకులు హెల్మెట్ ధరించకపోవడమూ మరో కారణం. మద్యం లేదా గంజాయి మత్తులో కొందరు కుర్రాళ్లు రాత్రిళ్లు మితిమీరిన వేగంతో వెళ్లి ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడంతో చనిపోతున్న వైనాలు జరుగుతున్నాయి. బైక్ రేసింగ్ మరో కారణంగా కనబడుతోంది. ఇలా అనేక రకాలుగా యువత రోడ్డు ప్రమాదాల్లో మరణించి అయిన కుటుంబాలను శోకసంద్రంలో ముంచెత్తుతున్నారు. దీనిపై అధికారుల పూర్తి పర్యవేక్షణ లేకపోవడం, కొన్నిచోట్ల హెచ్చరికలు చేస్తున్నా యువకులు లక్ష్యపెట్టకపోవడం వల్ల కూడా వారి ప్రాణాలను బలి తీసుకుంటున్న ఘటనలు కనిపిస్తున్నాయి.

బైక్ ప్రమాదాలే అధికం

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ఉండేవి ద్విచక్ర వాహనాలే. గతేడాది ఒక్క తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీసు రికార్డుల ప్రకారం మొత్తం ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ఘటనలు 276 ఉండగా.. కార్లు 175, లారీలు 114, ఆటోలు 56, ఆర్టీసీ బస్సులు 24, ప్రైవేటు బస్సులు 17 ఉన్నాయి. జాతీయ రహదారులపై 288, ఇతర రోడ్లపై 243 ప్రమాదాలు జరిగాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల నడుమ 90 శాతం ప్రమా దాలు నమోదయ్యాయి. గడిచిన రెండు నెలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 35 ఏళ్ల లోపు యువకులు 50 మందికి పైగానే మృత్యువాత పడ్డారు. ఇప్పుడు వస్తున్న బైక్‌ల సామర్థ్యానికి, మన రోడ్లకు పొంతన కుదరడం లేదు. ఏకంగా 610 సీసీ సామర్థ్యంతోనూ వస్తున్నాయి. అంటే సెకన్ల వ్యవధిలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇలాంటి బైక్‌లతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదం జరిగిన క్షణాల్లో మృత్యువాత పడు తున్నారు. తల్లిదండ్రులు స్టేటస్ పేరుతో అలాంటివే కొనిస్తున్నారు.. హెల్మెట్లు పెట్టుకోవడం లేదు. ఇద్దరికి మించి ప్రయాణిస్తున్నారు. వాహనంపై గర్ల్‌ఫ్రెండ్ ఉంటే మరీ రెచ్చిపోతున్నారు. ప్రమాదంలో ఇద్దరూ చనిపోయిన ఘటనలు ఉన్నాయి.

ఒకరి నిర్లక్ష్యం..మరొకరు బలి!

రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకుల ప్రాణాలు బలైపోతున్న ఘటనల్లో ఎదుటి వాహనాల వేగం, నిర్లక్ష్యమూ శాపంగా మారుతోంది. కాలేజీకి వెళుతున్న విద్యార్థుల బైక్‌లను కార్లు, లారీలు, బస్సులు ఢీకొట్టి వెళ్లిపోతున్న ఉదంతాలూ అధికంగానే ఉన్నాయి. జాతీయ రహదారులపైనా, రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డులోనూ జరిగిన ప్రమాదాల్లో పలువురు విద్యార్థులు మరణించారు.

- యువత ప్రాణాలు తీస్తున్న అతివేగం
- 3 నెలల్లో 75 మంది వరకూ మృతి
- అంతా 18 నుంచి 30 ఏళ్ల లోపువారే
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు
- ఎక్కువ సీసీ బైక్‌లే కారణం
- తల్లిదండ్రులూ తగ్గించాల్సిందే మరి



ధవళేశ్వరం ప్రమాదంలో మృతులు

హెల్మెట్ మరువొద్దు మిత్రమా!

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ మరచిపోవొద్దు మిత్రమా అంటున్నారు.. ఈ స్నేహితులు.. ఎందుకో తెలుసా.. మీరే చదవండి.. ముమ్మిడివరం మండలం క్రివానిరేవు పంచాయతీ పరిధి బూరుగపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి ముమ్మిడివరానికి చెందిన డొమ్మేటి జయఅభివన్ గత నెల 28వ తేదీన ఐ.పోలవరం మండలం పాత ఇంజరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తమ స్నేహితుడు ఆకాశ్‌రెడ్డి హెల్మెట్ లేకపోవడం వల్లే తమకు దూరమయ్యాడని.. హెల్మెట్ ఉంటే బతికి ఉండేవాడని.. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. చెప్పడమే కాదండోయ్.. సోమవారం ముమ్మిడివరంలో 20 మంది కలిసి రూ.25 వేల విలువగల వంద హెల్మెట్లను ముమ్మిడివరం స్టేట్‌బ్యాంకు వద్ద వాహనచోదకులకు ఉచితంగా అందజేశారు.



ఒక్క జనవరిలోనే పోయిన ప్రాణాలు

జనవరి 2 : తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్ (20) అన్నదమ్ముల బిడ్డలు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపి తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందారు.

జనవరి 3 : అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డు లో గురువారం అర్ధరాత్రి దాటాక కంటైనర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) మృతిచెందాడు.



మురారి ప్రమాదంలో మృతులు

జనవరి 3 : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ కళాశాల సమీపంలో హైవేపై లారీని ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో లారీకి హ్యాండిల్ తగిలి బైక్ జారిపడగా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20) లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

జనవరి 4 : కాకినాడ బీచ్‌రోడ్డులో ఓ కళాశాల బస్సు ఢీకొని వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ(22) మృతిచెందాడు.

జనవరి 5 : రంగంపేట మండలం వడిశలేరులో ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన ఆరవ మణికంఠ (23),తోకాడ చరణ్(22) మృతి చెందారు.

జనవరి 11 : కాకినాడ ఘాటీ సెంటర్ చేపల మార్కెట్ వద్దకు ద్విచక్రవాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన దేగల రేణుక (18) మృతిచెందింది.

జనవరి 19 : ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

జనవరి 20 : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు నక్క సాయికృష్ణ (23), అతడి మావయ్య కూడా మృతి చెందారు.

జనవరి 20 : కిర్లంపూడికి చెందిన ముక్కా నాగవీరభద్ర దుర్గ (20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర (21) సంక్రాంతి పండగకు వచ్చి బైక్‌పై హైదరాబాద్ తిరిగి వెళ్తున్నారు. కృష్ణా జిల్లా గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను వీరి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

జనవరి 26 : ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడగా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18), మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మృతిచెందారు.



గత నెల 28న ఐ.పోలవరం వద్ద మృతిచెందిన ఆకాశ్‌రెడ్డి, జయఅభినవ్



గోదావరి భవన్‌లో అర్జీ స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 325 అర్జీలు

మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి : కలెక్టర్

అమలాపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి):మండలస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా అర్జీదారుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో నిర్వహించారు. అర్జీదారుల నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామాపీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తిలు 325 అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌కు రావడం వల్ల అర్జీదారులకు డబ్బు, సమయం వృథా అవుతుందని కలెక్టర్ చెబుతూ తహశీల్దార్,ఎంపీడీవో ఆఫీసుల వద్ద కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.కార్తీక్ కొరెడ్డి, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, వికాసా జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ

ఎస్పీ కార్యాలయంలో 25 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందినవారు 25 అర్జీలను ఎస్పీకి అందించారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, భూవివాదాలతోపాటు ఇతర సమస్యలపై అర్జీలు అందాయని ఎస్పీ తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం చర్యలు 6



అమలాపురంలో ర్యాలీగా వస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు



కలెక్టరేట్ గేటును తోసుకుంటూ వస్తున్న వీహెచ్‌పీ నేతలు

హిందువులపై దాడులను నిరసిస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ర్యాలీ

కలెక్టరేట్ వద్ద నిరసన.. ఉద్రిక్తం

అమలాపురం టౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో హిందువులపై దాడులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అమలాపురం నల్లవంతెన వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. హిందువులపై అక్రమంగా లాఠీచార్జీ చేసి గాయపరిచిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబులు అడ్డు కున్నారు. చివరకు అవుట్‌గేట్ నుంచి కొందరికి మాత్రమే లోనికి వెళ్లేందుకు పోలీసులు అనుమతివ్వడంతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి అర్జీ అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా శాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాయచోటిలోని వీరభద్రస్వామి వారి పార్వేటి ఉత్సవం నిర్వహించుకుంటుంటే మరో వర్గంవారు దాడి చేయడం దారుణమన్నారు. పోలీసు అధికారులు విచక్షణ మరిచి హిందువులపై లాఠీచార్జీ చేశారని, ఆ అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, వీహెచ్‌పీ నాయకులు భమిడపాటి గోపాలకృష్ణమూర్తి, బులుసు జగదీష్, పులిమే రాజా, కాంబాబు, డాక్టర్ కొప్పిసెట్టి వెంకటరమణకుమార్, జి.నాగరాజు, స్వరూప్, వేదనభట్ల కళాపూర్ణారావు, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, అడబాల నరేష్, బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కర్రి చిట్టిబాబు, నల్లా పవన్‌కుమార్, భమిడిపాటి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

216ఇ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

అమలాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 216ఇ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ ఇందుపల్లి గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న ప్రక్రియ వల్ల ఇళ్లు కోల్పోతున్న బాధితులు తమ గోడును కలెక్టర్‌కు వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కొత్త హైవే' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనం చర్చనీయాంశమైంది. 216ఇ జాతీయ రహదారి రావులపాలెం నుంచి పేరూరు వరకు నిర్మాణం చేసేందుకు నేషనల్ హైవేశాఖ ప్రణాళిక చేస్తోందని, దీనిలో భాగంగా ఇందుపల్లి గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో ఏటిగట్టు లోపల రహదారి నిర్మాణం వల్ల గ్రామంలో పెద్దఎత్తున ముంపు సమస్య ఏర్పడుతుందని ఫిర్యాదులో వారు వివరించారు. ఇందుపల్లి గ్రామాన్ని ఆనుకుని ఏటిగట్టు బయట ఉన్న రహదారి ఇప్పటికే జాతీయ రహదారిశాఖ అధీనంలో ఉందన్నారు. దానిని అభివృద్ధి చేస్తే వరద ముంపు సమస్య పరిష్కారం కావడంతో ప్రజాధనం దుర్వినియోగం కాదని వివరించారు. కొందరు వ్యక్తులకు మేలు చేసేలా అధికారులు నడిపూడి వద్ద నుంచి అలైన్‌మెంటు మార్పు చేశారని వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

జనసేన ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు 7

వేదికపై యువత, రైతు, మహిళ ప్రతినిధులకు మాట్లాడే అవకాశం మంత్రి నాదెండ్ల

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (మంగళ)	సా.6.21
	సహరి (బుధ)	ఉ.4.52



వకుళమాత అన్నదాన భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మాస్టర్ ప్లాన్ ప్రకారం వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధి

భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తాం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలో ప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాము' అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయంలో వివిధ పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించి క్షేత్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులు, గ్రామ స్తులతో చర్చించారు. 'భక్తుల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. వసతి, దర్శన, సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రతి భక్తుడికీ సాధ్యమైనంత త్వరగా దర్శనం అందించే చర్యలు చేపట్టాలి. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాం' అని చెప్పారు. రూ.3.80కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్డు వద్ద ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్లు పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి సూచనలు చేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కోనేరు నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని, డార్మెటరీలు, క్యూలైన్ల పనులు శరవేగంగా చేస్తున్నా మన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల సహకారం కోరుతున్నామని, పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి భక్తుల ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ సీహెచ్ విద్యాసాగర్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎస్ఐ ఎస్.రాము, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు



వేసవి నేస్తం వచ్చేసిందోచ్



అంబాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎరుపు రంగుతో నోరూరించే పుచ్చకాయ అంటే అందరికీ ఇష్టమే. మండుటెండలో ముక్క తింటే ఆ హాయి చెప్పలేనిది. ఎండలు ముదిరి శరీరంలోని ఖనిజ లవణాలు బయటకుపోతున్న తరుణంలో ఈ పుచ్చకాయలను రుచిచూస్తే ఆ మజానే వేరు. ఈ తీయని ఫలాలు ఇప్పుడు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దాహార్తి తగ్గించేందుకు ఇది బాగా పనిచేస్తుంది. రక్తపోటు ఉన్న వారు పుచ్చకాయ తింటే ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు చెప్తున్నారు. కాగా సీజను ఆరంభంలోనే హోల్‌సేల్ ధరలు హడలెత్తిస్తున్నాయి. రిటైల్‌గా మరింత ఎక్కువగా అమ్ముతున్నారు.

మార్కెట్‌లోకి పుచ్చకాయులు
సీజను ప్రారంభంలోనే అధిక ధరలు
రాష్ట్రంలో పంట లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి



100 గ్రాముల పుచ్చకాయ గుజ్జులో ఉండే పోషకాలు...

నీరు: 95.2 గ్రాములు
ప్రొటీన్: 0.3గ్రాములు
కొవ్వు పదార్థాలు: .0.2 గ్రాములు
పీచు పదార్థాలు: 0.4 గ్రాములు
కెరోటిన్: 169 మైక్రో గ్రాములు
సి విటమిన్: 26 మిల్లీ గ్రాములు
కాల్షియం: 32 మిల్లీ గ్రాములు
పాస్పరస్: 14 మిల్లీ గ్రాములు
ఇనుము: 1.4 మిల్లీ గ్రాములు
సోడియం: 104.6 మిల్లీ గ్రాములు
పొటాషియం: 341 మిల్లీ గ్రాములు
శక్తి: 17 కిలో కేలరీలు



పుచ్చకాయలో విటమిన్-బి, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. 92 శాతం అల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండడంతో దీనిని తినడం వల్ల శరీరానికి నూతన శక్తి వస్తుంది. మలబద్దకం నివారణకు ఇది మంచి చిట్కా అని వైద్యులు చెప్తున్నారు. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ నివారణకు దోహదపడుతుంది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి కూడా ఉపయోగం. ఆస్మా, మధుమేహం, అర్థరైటిస్ సమస్యల నుంచి చక్కని ఉపశమనం. రక్తప్రసరణ పెరుగుతుంది. గుండె కండరంలోని కణాలను కాపాడడంలో పుచ్చకాయలోని లైకోపీన్ అనే పదార్థం బాగా ఉపయోగపడుతుంది. ముఖవర్చసు పెంచి సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న వారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే నీరసం తగ్గి శక్తి వస్తుంది. పుచ్చకాయలో ఉన్నన్ని నీళ్లు మరే పండులో కానీ, కాయలో కానీ ఉండవు. గ్లాసు పుచ్చకాయ రసంలో స్పూన్ తేనె కలిపి రోజూ తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు తగ్గిపోతాయని వైద్యులు చెప్తున్నారు. లోపల ఎర్రటి గుజ్జుతో చూడగానే నోరూరించే పుచ్చకాయ గుజ్జులో గ్లుటాథియాన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు, జబ్బులు రాకుండా కాపాడుతుంది.



ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో పుచ్చకాయల విక్రయాలు జరిగేవి. నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి విక్రయాలు పెరిగాయి. పుచ్చకాయను కోసి ప్లాస్టిక్ గ్లాసుల్లో ఆకర్షణీయంగా పెడుతుండడంతో కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పుచ్చకాయ జ్యూస్ ఎక్కువగా తాగుతున్నారు. గిరాకీ దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు.

30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను



పుచ్చకాయల వ్యాపారాన్ని గత ముప్పై ఏళ్లగా చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి సైకిల్ వ్యాపారులు, చిరు వ్యాపారులకు విక్రయించేవాడిని. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు మన రాష్ట్రంలో పుచ్చకాయ పంటను సాగు చేయట్లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

- దంగేటి నారాయణరావు,
పుచ్చకాయల వ్యాపారి, బండారులంక,

పుచ్చకాయలతో ఆరోగ్యం



వేసవిలో పుచ్చకాయలను తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. దీంట్లో చాలా ఔషధ గుణాలు ఉన్నాయి. నీరసం కలిగిన వ్యక్తులు పుచ్చకాయలను తింటే కొంత ఉపశమనం పొందవచ్చు. దీనిని తినడం వల్ల నీటి శాతం పెరుగుతుంది. దాహం తగ్గుతుంది.

డాక్టర్ కేఎన్ శ్రీనివాసరావు,
వైద్యాధికారి, అంబాజీపేట

నమో నారసింహాయ

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- గోవిందనామంతో పులకించిన కోరుకొండ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కోరుకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపైన, దిగువున స్వామి వారు ప్రత్యేక ఆభరణాలు, అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5గంటల నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కొండ ఎక్కలేని భక్తులకు స్వామి వారి పాదాల వద్ద పానకం పోసి, కొబ్బరి కాయలు కొట్టారు. మరికొందరు కొండపైకి వెళ్లి స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగువ దేవస్థానం ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆవునెయ్యి, ఒత్తితో పొన్నచెట్టు దీపాలు వెలిగించారు. పెద్దపెద్ద మట్టి మూకుడులో మంచి నూనె వేసి దీపాలు వెలిగించారు. అంతకుముందు దేవుని కోనేటి వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగించారు. మహిళలు కొండ పాదవునా 615 మెట్లకు పసుపు రాసి బొట్టు పెట్టుకుంటూ పైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఉదయం, సాయంత్రం స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. 5 రోజుల పాటు భక్తులందరికీ అన్నదానం చేస్తామని సత్రం ఈవో తెలిపారు.

వైభవంగా నరసన్న రథోత్సవం

నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రథోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, వ్యవస్థాపక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, ఇతర అధికారులు, నాయకులు ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారిని, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి మధ్యాహ్నం 1.56 గంటలకు రథోత్సవం ప్రారంభించారు. పండితులు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవిందా గోవిందా అంటూ భక్తజనం రథాన్ని లాగారు. రథానికి ముందు పండితుల వేద గోష, భజనలు, గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాలు ఆకట్టుకున్నాయి. 250 మంది స్వామి మాలధారులు జెండాలతో రథం ముందు నడిచారు. రథం సాయంత్రం 6గంటలకు స్వామి దిగువ దేవస్థానానికి చేరింది. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు స్వచ్ఛందంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం, స్వామి వారు



శ్రీ లక్ష్మీనరసింహ స్వామి





స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల, పల్లకీ మోస్తున్న దృశ్యం

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, కటకం చలం, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

లక్ష్మీనరసింహస్వామి, శ్రీభూ సమేత అనంత పద్మనాభ స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి 11గంటలకు వైభవంగా జరిగింది. ఒకే రోజు ఒకే శుభముహూర్తంలో ఇటు నరసింహస్వామిది, అనంత పద్మనాభుడి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. రథోత్సవం అనంతరం సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లను రథం పైనుంచి ఎదుర్కోలుతో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయానికి తోడ్కొని వచ్చారు. అక్కడ మంగళస్నానాలు జరిపించారు. కల్యాణోత్సవాల్లో పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి చంటిబాబు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వీరితో పాటు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, మరో 300 మంది యజమాన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ, అంతర్వేది నరసింహస్వామి దేవస్థానం, పలువురు భక్తులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోరుకొండలో నేటి కార్యక్రమాలు

నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం కొండ పైన, దిగువున స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. ఉదయం 9గంటలకు సేవాకాలం, రాత్రి 8గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. రాత్రి 7నుంచి 9గంటల వరకు స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన, శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు జరుగనున్నాయి.



కోనేటిలో స్నానమాచరిస్తున్న భక్తులు



రథోత్సవంలో శక్తివేషధారణలు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి



వేంకటేశ్వరస్వామి వేషధారణ

తలుపులమ్మకు కాసుల హారం

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం లోవ స్థానంలో తలుపులమ్మ అమ్మవారికి కాకినాడకు చెందిన కోకా వెంకట కోటేశ్వర ఫణి-మైథిలి దంపతులు 102గ్రాములతో బంగారు కాసుల హారం చేయించారు. సోమవారం హారాన్ని ఈవో పి.విశ్వనాథరాజుకు అందజేశారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనమిచ్చి తీర్థ ప్రసాదాలందజేశారు.



తొడుగు మేలే

- మామిడి కాయలకు తొడుగులతో మంచి దిగుబడులు
- 50 శాతం రాయితీపై కవర్ల పంపిణీ
- డీబీటీ పథకంలో రైతులకు వర్తింపు
- ఉద్యాన శాఖ అధికారిణి దివ్యశ్రీ





రాజానగరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో మామిడి కాయలకు తొడుగులు అమర్చడంతో మేలైన పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ రైతులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పండ్ల తోటల రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై కవర్లు/తొడుగులను మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్(డీబీటీ) పథకంలో భాగంగా అందజేస్తోందన్నారు. కవరు ఒకటి రూ.2 వంతున కొనుగోలు చేస్తే దీనిలో రూ.1 రాయితీ రైతు ఖాతాలో జమవుతుందన్నారు. హెక్టారుకు 10 వేలు కవర్లపై రాయితీ వర్తిస్తుందన్నారు.

సమర్పించాల్సిన పత్రాలు...

ఆసక్తి కలిగిన రైతులు కవర్లు కొనుగోలు చేసిన బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకాలు జిరాక్స్ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోను సంబంధిత రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో అందజేయాల్సి ఉంటుందన్నారు.



మామిడి చెట్టున ఉన్న కాయలకు తొడిగిన కవర్లు

చీడపీడల నియంత్రణ..

పండ్ల తోటల రైతులు మామిడి కాయలకు కవర్లు వినియోగించడం వల్ల మసి, మంగు, మచ్చలు, తేనె మంచు పురుగు, కాయపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలైన వాటిని నియంత్రించడంతో పాటు నాణ్యమైన మామిడి పండ్ల దిగుబడులు పొందవచ్చని దివ్యశ్రీ అంటున్నారు.

ఎప్పుడు, ఎలా వాడాలి..

మామిడి పిందె దశలో అనగా నిమ్మకాయ, కోడి గుడ్డు పరిమాణం దశకు చేరుకున్న తర్వాత కవర్లు వాడాలి. మంచి పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీమీటర్ల పైన తొడిమకు సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలన్నారు. 50 రోజుల తర్వాత కాయలు కోత దశకు చేరుకుంటాయన్నారు.

ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి..

మామిడి తొడుగులు/కవర్లు చెక్క గుజ్జుతో తయారైన పేపరును మామిడి కాయకు తొడగడం వల్ల మంచి లక్షణాలు చేకూరి, చెడు లక్షణాలు తొలగిపోతాయి. అంతే కాకుండా క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుంది. అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన నుంచి కాపాడుతుంది. పరిమాణాన్ని, సహజ రంగును వృద్ధి చేస్తుంది. అలాగే తక్కువ కాలంలోనే పెరుగుదల సామర్థ్యాన్ని పెంచి, అధిక దిగుబడులనిస్తుంది. అంతేకాకుండా మామిడి పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పండ్ల తోటల రైతులు, వ్యాపారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివ్యశ్రీ కోరారు.

హోంగార్డుపై ఎస్‌ఐ ప్రతాపం

- దొంగతనం అంటగట్టాలని ప్రయత్నం
- నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి
- తీరా అతడు కాదని తేలడంతో వదిలివేసిన వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం?


ఎస్‌ఐ యూనిఫాంలో దోపిడీకి పాల్పడిన అసలు నిందితుడు

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లారీని ఎస్‌ఐ వేషంలో బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే అనుమానంతో ఒక హోంగార్డును విచారణ పేరుతో ఒక ఎస్‌ఐ చితకబాదిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 2న తెల్లవారుజామున రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు బ్రిడ్జిపై చిత్తూరు వెళుతున్న ఓ లారీని పోలీసు అంటూ ఓ వ్యక్తి ఎస్‌ఐ దుస్తుల్లో అటకాయించాడు. డ్రైవరును బెదిరించి బైక్‌పై ఎక్కించుకుని పేపరుమిల్లు సమీపంలోని ఓ ఏటీఎంకి తీసుకెళ్లాడు. డ్రైవరుతో రూ.10వేలు డ్రా చేయించి తీసుకుని అతడిని లారీ వద్ద దింపేశాడు. ఈ విషయం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ వరకూ వెళ్లడంతో త్రీటౌన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు వేగం చేశారు. సీసీ ఫుటేజీ లను పరిశీలించారు. ఓ హోం గార్డు మాదిరిగా ఆ ఫుటేజీలోని వ్యక్తి కనబడడంతో ఆ హోంగార్డును ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడికి తీసుకువెళ్తున్నారో ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా చెప్పలేదు. ఆ హోంగార్డు సుమారు 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అతడిని పోలీసుల వార్‌రూమ్‌కు అంటే నిందితులను చితక్కొట్టే ప్రదేశానికి తీసుకెళ్లారు. ఓ ఎస్‌ఐ వచ్చి సదరు హోంగార్డును నానా బూతులు తిట్టారు. భౌతిక దాడికీ దిగాడు. నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి చేశాడు. ఈలోపు ఆరుగురు పోలీసులు జీపులో ఆ హోంగార్డు ఇంటికెళ్లి ఏ ఉత్తర్వులూ చూపకుండా సోదాలు చేశారు. హోంగార్డు తల్లి, చిన్న పిల్లాడిని బెంబేలెత్తించారు. అయితే అసలు దొంగ దొరికాడని సమాచారం రావడంతో రాత్రి 9 గంటల సమయంలో ఆ హోంగార్డుకు సర్ది చెప్పి పంపేశారు. ఆ హోంగార్డుతో ఒట్టు వేయించుకున్నారు. చిరుద్యోగి కావడంతో అధికారులను ప్రశ్నించలేక రోదిస్తూ ఇంటికెళ్లిపోయాడు. అనంతరం హోంగార్డు కార్యాలయానికి అతడిని అటాచ్ చేశారు.

జైల్లో పరిచయం.. ఒంటరి మహిళలే లక్ష్యం!


వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్

- వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు దొంగలు
- 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం

కాకినాడ రూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీల్లో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాకినాడ ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఈ వివరాలను వెల్లడించారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడే వారిని పట్టుకునే చర్యల్లో భాగంగా సోమవారం ఉదయం కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. ఇంద్రపాలెం మునలమ్మతల్లి గుడికి సమీపంలో ఎస్‌ఐ ఎం. వీరబాబు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వస్తున్న కాకినాడ రూరల్ మండలం తూరంగికి చెందిన గంపల సతీష్ (25), కిర్లంపూడి మండలం బూరగుపూడికి చెందిన పట్నం వరప్రసాద్(26)ను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు పాత నేరస్థులేనని, ఒంటరి మహిళలే వారి లక్ష్యమని తెలిసిందని ఎస్డీపీవో చెప్పారు. నిందితులు జైల్లో ఒకరికొకరు పరిచయమై మిత్రులై కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. వారి నుంచి సుమారు రూ.6,50,000 విలువచేసే 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో 2, కరప పీఎస్‌లో 1, కాకినాడ 1వ పట్టణ పీఎస్ పరిధిలోని 1కేసులో మొత్తం 78 గ్రాముల చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కాకినాడ సీసీఎస్ సీఐ కృష్ణ, ఏఎస్‌ఐలు గోవిందు, పుల్లయ్య పాల్గొనగా దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్డీపీవో అభినందించారు.

చంద్రబాబు నిర్ణయాన్ని శిరసావహిస్తా

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, భవిష్యత్తు రథసారధి నారా లోకేశ్ నిర్ణయాలు, ఆదేశాలను శిరసావహిస్తానని, వాటిని తాను, తన కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కుటుంబం ఎల్లప్పుడు పాటిస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్‌ఎన్ వర్మ పేర్కొన్నారు. ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు తొలివిడతలోనే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆయనకు ఇస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భావించారు. అయితే ఆదివారం రాత్రి ప్రకటించిన జాబితాలో వర్మకు ఎమ్మెల్సీ రాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తమ నాయకుడిని ఈ సారి అన్యాయమే జరిగిందని ఆవేదన చెందారు. దీంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి సోమవారం భారీగా తరలివచ్చారు. వారితో వర్మ మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. చంద్రబాబుతో మన ప్రయాణం 23 ఏళ్లు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో ప్రజాసమస్యలపై పోరాటం సాగించామని, అధికారంలోని ఉన్నా, ప్రతిపక్షంలో అయినా వారికి, పార్టీకి అండగా ఉన్నామని తెలిపారు. ప్రజాసేవ చేసే అవకాశమే తనకు పెద్ద పదవి అని అన్నారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఎల్లప్పుడు చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉంటుందని ప్రకటించారు. వారి అడుగుజాడల్లోనే తామంతా నడుస్తామని తెలిపారు. పార్టీలో మనకు ఎంతో భవిష్యత్తు ఉందని, అందరూ కుటుంబంలా కలిసికట్టుగా ఉంటూ పార్టీకి అండగా ఉందామని వర్మ ప్రకటించారు.

ఆలోచింపజేసిన ఇది అతని సంతకం


ఇది అతని సంతకం నాటకంలోని ఓ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి జీవితంలో ఒక లక్ష్యం, నిర్దిష్టమయిన ప్రణాళిక, బలమైన నిర్ణయం ఉంటుంది. దానిని ఆచరణలో పెట్టి సాధించుకోగలిగిన వారి జీవితం పరిపూర్ణమవుతుంది అని ఇది అతని సంతకం నాటకం ద్వారా చాటి చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో మూడోరోజు సోమవారం గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది అతని సంతకం నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ) రచించగా ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

రేపు రైల్వే జీఎం రాక

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం పర్యటించనున్నారు. ఆయన భద్రతా పరమైన అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తారని తెలుస్తోంది. ఉదయం 10 గంటలకు కాకినాడలో బయలుదేరి ట్రాక్, పాయింట్లు తదితర అంశాలను పరిశీలించుకుంటూ రాజమహేంద్రవరం గుండా విజయవాడ వెళ్తారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆగినా ట్రాక్, సిగ్నల్స్ సంబంధిత భద్రతా అంశాలనే పరిశీలిస్తారని చెబుతున్నారు. వాస్తవానికి గత నెల 9 నుంచి ఆయన పర్యటన వాయిదా పడుతూ వస్తోంది. ఇక్కడ పనులు పూర్తికాకపోవడంతో ఆలస్యమైంది. గతంలో జీఎం తనిఖీలు ఉంటే క్వార్టర్లతో సహా అన్నిటినీ ముస్తాబు చేయడం రివాజుగా ఉండేది. కానీ ఇప్పుడు నిధుల కొరత వల్ల భద్రతా పనులకే పరిమితమయ్యారు.

'పది' మూల్యాంకన విధులపై సమావేశం

కాకినాడ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షాపత్రాల మూల్యాంకనం విధులపై సోమవారం కాకినాడలోని రామకృష్ణ ఆడిటోరియంహాల్లో పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ జి.నాగమణి ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలకుల సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాల డీఈవోలు రమేష్, నారాయణ, ఏసీఈలు, సీసీవోలు, ఏసీవోలు పాల్గొన్నారు.

ఓపీకపట్టి..




కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి సోమవారం రోగులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే బారులుతీరారు. 'ఓపీ' కోసం క్యూలలో గంటల తరబడి వేచి ఉన్నారు. నిరీక్షించి, నీరసించారు.

ఫొటోగ్రాఫర్ -కాకినాడ

కొడుకుని చూసేందుకు వెళ్తూ.. తండ్రి మృత్యువాత


అప్పారావు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

రాజుపాలెం రహదారిపై మృతదేహంతో బంధువుల ఆందోళన

కిర్లంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు(29) ఆదివారం రాత్రి చిల్లంగి నుంచి వీరవరం అత్తవారింటికి వెళ్తుండగా రాజుపాలెం గ్రామం వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అప్పారావు ప్రమాదవశాత్తు ఆ లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో అప్పారావు తలకు బలయమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బంధువులు సోమవారం ఉదయం రాజుపాలెం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిపై మృతదేహంతో నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే కిర్లంపూడి పోలీసులు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామని నచ్చజెప్పారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

4 నెలల క్రితమే కొడుకు పుట్టడంతో..

అయితే అప్పారావు తాపీపని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, కూతురు, ఉన్నారు. కాగా 4 నెలల క్రితమే కొడుకు పుట్టాడు. కుమారుడిని చూసేందుకు ఆదివారం రాత్రి వెళ్తుండగా అప్పారావును మృత్యువు లారీ రూపంలో కబలించేసింది. ఈ దుర్ఘటనతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో అటు చిల్లంగి, ఇటు వీరవరం గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. పిల్లలిద్దరూ అనాధలైపోయారని అప్పారావు భార్య, బంధువులు రోధనలు మిన్నంటాయి. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని మృతుడు అప్పారావు బంధువులు కోరుతున్నారు.

పరీక్ష రాసేందుకు వెళ్తూ... ఇంటర్ విద్యార్థి దుర్మరణం


సంఘటనా స్థలంలో వంశీ మృతదేహం


ఫైల్‌ఫొటో

సామర్లకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అభ్యసించాలని ఎన్నో కలలు కన్న విద్యార్థిపైకి మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించిన సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో సోమవారం జరిగింది. సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెనికి చెందిన ప్రగాఢ వంశీ (19) ఇంటి నుంచి కాకినాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు మిత్రులతో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యన రోడ్డుపై ఇసుక గుట్ట కారణంగా మోటార్‌సైకిల్ రోడ్డుపైకి స్కిడ్ అయ్యి వెనుక కూర్చున్న ప్రగాఢ వంశీ (19) రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ వంశీ తలపై నుంచి వెళ్లిపోవడంతో మరణించాడు. కేవలం పది నిమిషాల ముందే పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి వెళ్లిన తమ కుమారుడు ప్రమాదంలో మృతిచెందాడన్న సమాచారంతో వంశీ తండ్రి రాజు, తల్లి రోధించారు. సంఘటనా స్థలికి సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సిబ్బందితో చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు నిర్వహించారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామం వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన విజయకుమారి

రావులపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఉబలంక వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి (40) భర్త రమేష్‌బాబుతో కలిసి మోటార్‌సైకిల్‌పై పని నిమిత్తం రావులపాలెం వచ్చారు. తిరిగి స్వగ్రా మం వెళ్తుండగా మార్గమధ్యలో ఉబలంక సమీపంలోకి వచ్చేసరికి టిప్పర్ లారీ బలంగా ఢీకొంది. విజయకుమారి లారీ కింద పడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందగా భర్త రమేష్‌బాబు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

- వేదికపై యువత, రైతు, మహిళ ప్రతినిధులకు మాట్లాడే అవకాశం
- మంత్రి నాదెండ్ల మనోహర్


కాకినాడలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో మార్చి 14న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభ దాదాపు 5గంటలపాటు సాగుతుందన్నారు. మన భాష, యాస, సంస్కృతిని ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశామన్నారు. సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నా దృష్ట్యా వారికి ఎలాంటి ఇక్కట్లు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో భోజనానికి ఇబ్బంది కలగకుండా ముఖ్యమైన 4 రహదారుల్లో భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభలో యువతకు మాట్లాడే అవకాశం కల్పించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించారన్నారు. రైతు, మహిళ ప్రతినిధులు మాట్లాడతారన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై పవన్ మాట్లాడతారని పేర్కొన్నారు.

పారిశుధ్యం కోసం ప్రత్యేక కమిటీ

సభ పూర్తయిన అనంతరం పరిసరాలను శుభ్రం చేయడానికి ప్రత్యేక కమిటీ నియమించాలని పవన్ స్పష్టం చేశారన్నారు. ఈ మేరకు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో 25 మంది స్థానిక నాయకులతో కమిటీని నియమించామని, ఈ కమిటీ సభ ముగిసిన అనంతరం సభా ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జెండాలు, ఫ్లెక్సీలు, ఇతర పార్టీల జెండాలు కిందపడినా వాటిని జాగ్రత్తగా తొలగిస్తారని తెలిపారు. సభకు తరలివచ్చే కార్యకర్తల కోసం మజ్జిగ, మంచినీరు, ఓఆర్‌ఎస్‌ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. వీటితోపాటు పుచ్చకాయ ముక్కలు ఉచితంగా అందించేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. ఇందుకు కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల తోపుడు బండ్లవారితో మాట్లాడుతున్నాం.


75 సీసీ కెమెరాలతో నిఘా

ఉపముఖ్యమంత్రి పవన్ సభకు హాజరవుతున్నందున ఆయన భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోలీస్ డిపార్టుమెంట్ తీసుకుంటుందన్నారు. ఇందుకోసం 75 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు తరలివచ్చే లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల14న జరగనున్న 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, సభ ఏర్పాట్లును ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు.

తుని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా రూపాదేవి


బాధ్యతలు స్వీకరిస్తున్న రూపాదేవి

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలో తీవ్ర గందరగోళానికి తెరపడింది. 17 మంది వైసీపీ కౌన్సిలర్లు వరుసగా టీడీపీలోకి చేరిపోవడంతో వైసీపీ సంఖ్యా బలం సన్నగిల్లింది. దీంతో చేసేదేమీ లేక ఆ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి రాజీనామా సమర్పించారు. దీంతో టీడీపీలోకి చేరిన 17 మంది కౌన్సిలర్లతో తొలి కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేరిన 28వ వార్డు కౌన్సిలర్ కుచ్చర్ల పాటి రూపాదేవి ఇన్‌చార్జి వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో వైసీపీ తుని మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. బాధ్యతలు చేపట్టిన రూపాదేవికి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, సుర్లలోవరాజు, యినుగంటి సత్యనారాయణ, నాయకులు, కౌన్సిల్ సభ్యులు శుభాకాంక్షలు తెలపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


సత్యనారాయణ (ఫైల్)

పిఠాపురం రూరల్, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): పంటపొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురయి రైతు మరణించాడు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన రైతు చిన్నారి సత్యనారాయణ(65) సోమవారం పశువుల మేత కోసం గడ్డి కోసేందుకు పొలంలోకి వెళ్లాడు. గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మరణించాడు. పంటపొలాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు ఎలక్ట్రికల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, వీటి వల్లే సత్యనారాయణ మరణించాడని అతని కుటుంబసభ్యులు, రైతులు చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలోని పీచు ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అమలాపురం అగ్నిమాపక అధికారి కె.మురళీకొండబాబు తెలిపారు. సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపుచేశారు. దొమ్మేటి విష్ణువీర వసంతరాయులు, భైరిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన ఫ్యాక్టరీలోని పీచు రూ.3లక్షలమేర నష్టం వాటిల్లినట్టు చెప్పారు.

రాజవొమ్మంగిలో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

రాజవొమ్మంగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిలో ఆగిఉన్న కారులో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన గంటిమెల్ల సన్యాసిరావుకు చెందిన కారులో ఇద్దరు వ్యక్తులు లాగరాయి నుంచి రాజవొమ్మంగి సాయికిరణ్ కాన్వెంట్‌కు పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. ఈ తరుణంలో కారు ఇంజన్ నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు, బంక్ సిబ్బంది అదుపు చేశారు. రేడియేటర్‌లో వాటర్ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మెకానికర్లు తెలిపారు. కారు రన్నింగ్‌లో మంటలు వ్యాపిస్తే పెనుప్రమాదం జరిగి ఉండేదని భావించారు.

ఆన్‌లైన్ షేర్ల పేరిట రూ.60 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షేర్లలో అధిక లాభాలు వస్తాయని ఓ విశ్రాంత ఉద్యోగి లక్షల్లో సొమ్ము కోల్పోయారు. ప్రకాశం నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటేశ్వరనగర్‌కు చెందిన నున్న వెంకటేశ్వరరావు పేపర్ మిల్లులో జీఎం స్థాయిలో ఉద్యోగం చేస్తూ రెండేళ్ల క్రితం విరమణ పొందారు. విరమణ డబ్బులను షేర్ మార్కెట్‌లో పెట్టడం ద్వారా ఇంకా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో షేర్ మార్కెట్ గురించి వెతికారు. ఈ క్రమంలో ఓ కంపెనీ ఎక్కువ మొత్తంలో లాభాలు చూపడంతో ఆ కంపెనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రక్రియ పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి దఫదఫాలుగా పెట్టుబడి పెట్టగా డబ్బులు బాగానే వచ్చాయి. దీంతో ఈ జనవరి నుంచి రూ.60లక్షలు పెట్టుబడి పెట్టారు. యాప్‌లో రూ.1కోటికిపైగా లాభాలు చూపిస్తున్నాయి. అయితే ఆ డబ్బులు తన ఖాతాలో జమ కావడం లేదు. దీంతో ఆ యాప్ గురించి ఆయన ఇంటర్నెట్‌లో వెతకగా కనబడలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు మంత్రి సాయం


మహిళను మంత్రి వాహనం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

అలమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు సాయం చేసి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుబాష్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన సూరిశెట్టి రేవతి, రామకృష్ణ దంపతులు బైక్‌పై వెళ్తుండగా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద ప్రమాదం జరిగి రేవతి తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో అసెంబ్లీ సమావేశాలకు రామచంద్రపురం నుంచి అమరావతి వెళ్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆగారు. మహిళను తక్షణం తన వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసాయం అందించారు. అక్కడ ఉన్న వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యసాయం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అమరావతికి తరలివెళ్లారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

జనసేన సభను విజయవంతం చేయాలి

అయినవిల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం అయినవిల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో జన సైనికులు పాల్గొని ఆవిర్భావ సభను విజయవంతం చేయాలన్నారు.

పీ-4 సర్వేను వేగవంతం చేయాలి

అల్లవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు పీ-4 సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పీ-4 సర్వేపై అవగాహన కల్పించి సూచనలు చేశారు. ఈసర్వేలో మండలంలో 19,560 వివరాల నమోదు ఈనెల18నాటికి పూర్తి చేయాలన్నారు.

ఓడలరేవు గ్రామాన్ని ఓఎన్జీసీ దత్తత తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఓడలరేవు గ్రామస్తులు

అమలాపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం ఓడలరేవు గ్రామాన్ని ఓఎన్జీసీ సంస్థ దత్తత తీసుకోవడంతో పాటు స్థానికులకు 70శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో సోమవారం ఓడలరేవు గ్రామస్తులు సోమవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. మూడు దశాబ్దాలుగా ఓడలరేవులో ఓఎన్జీసీ సంస్థ ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ టెర్మినల్స్‌తో వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. సంస్థ కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు పాడైపోవడంతో పాటు భూమి క్రుంగిపోయిందని, జల కాలుష్యంతో ప్రజలు దినదిన గండంతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నా ఓఎన్జీసీ సంస్థ గ్రామానికి కనీస సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓడలరేవు గ్రామస్తులకు హెల్త్‌కార్డులు అందించాలని, ఓఎన్జీసీ కార్యకలాపాలతో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు జీవనభృతి చెల్లించాలని, సిస్మిక్ సర్వే బాంబింగ్‌తో ఇళ్లకు నష్టం వాటిల్లుతున్నందున ప్రతీ ఇంటికీ రూ.5లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, సీఎస్సార్ నిధులు అధిక మొత్తంలో గ్రామానికి కేటాయించాలని తదితర డిమాండ్లతో కలెక్టర్‌కు అర్జీ అందించారు. కలెక్టరేట్ ఎదుట నిరసనకు కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడ రామకృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

విజ్ఞానశాస్త్ర ఆలోచనలతో శాస్త్రవేత్తలవుతారు

డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా



మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

ముమ్మిడివరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞానశాస్త్ర ఆలోచన విధానాలను పెంపొందించుకోవడం ద్వారా మంచి శాస్త్రవేత్తలుగా ఎదగగలుగుతారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి విజ్ఞానశాస్త్ర సంబరాల ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభలో డీఈవో సలీంబాషా ముఖ్య అతిథిగా మాట్లాడారు. విజ్ఞానశాస్త్ర జిల్లాస్థాయి పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈసందర్భంగా అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సర్ ఐజాక్ న్యూటన్, ఆర్యభట్ట వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరు చాటిన ప్రతిభకు డీఈవో అభినందించారు. క్విజ్ పోటీల్లో పి.లక్ష్మీవాడ విద్యార్థులు ప్రథమ, సిరిపల్లి, రావులపాలెం జిల్లాపరిషత్ ఉన్నపాఠశాల ద్వితీయ, అంబాజీపేట జడ్పీ ఉన్నతపాఠశాల, మండపేట శ్రీగౌతమీ మున్సిపల్ ఉన్నతపాఠశాల తృతీయ స్థానాలు సాధించాయి. చిత్రలేఖనం పోటీల్లో వీవీమెరక మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రథమ, చింతలమెరక మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ద్వితీయ, రావులపాలెం పొడగట్లపల్లి ఎంపీపీ పాఠశాల తృతీయ స్థానాలు సాధించారు. క్విజ్ పోటీలు నిర్వహించిన పీవీ బ్రహ్మానందం, మేక రామలక్ష్మి, టీఆర్ఎస్ పద్మావతిలను డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి గౌరీశంకర్, సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, సమగ్రశిక్షణ ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. జిల్లా విజ్ఞానశాస్త్ర అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర ఆలోచనా విధానాలు పెంపొందించడం ద్వారా వారు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వీలుపడుతుందన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో కౌశలాలను పెంచి విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించాల్సి ఉందన్నారు. సమగ్ర శిక్ష ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను నూతన ఆవిష్కరణలకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం జడ్పీ బాలుర హైస్కూలు హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కురసాంపేట వాటర్ ట్యాంక్ ముట్టడి



ట్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యానాం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ పరిధిలోని కురసాంపేట వాటర్ ట్యాంకును స్థానిక ప్రజలు ముట్టడించారు. తాగు నీరుందించడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారని ఆరోపించారు. పది రోజులుగా మంచినీరు సరఫరా రావడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సోమవారం గ్రామస్తులందరూ ట్యాంక్ వద్దకు చేరుకుని రోడ్డుకు ఎదుట బైఠాయించారు. దీంతోట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు. అనంతరం గ్రామస్తులు ట్యాంకు వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. సిబ్బంది పనితీరు బాగాలేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ప్రజాపనుల శాఖ ఈఈ నాగరాజును గ్రామస్తులు నిలదీశారు. ప్రస్తుతం సంపులో ఉన్న నీళ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, ట్యాంక్‌ను శుభ్రం చేయడంలేదని ఆరోపించారు. ముఖ్యంగా సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. సమాచారం లేకుండా సమయపాలన లేకుండా మంచినీటిని సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల పర్యవేక్షణకు స్టేట్ మోనటరింగ్ గ్రూప్



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల మౌలిక సదుపాయాల కల్పనతో పాటు క్లియరెన్సులను వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్టు మోనటరింగ్ గ్రూపును ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. ప్రాజెక్టుల ఏర్పాటులో సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, అనుమతులు, క్లియరెన్సులను వేగవంతంచేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో మోనటరింగ్ గ్రూపు పనిచేస్తుందన్నారు. సోమవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రాజెక్టు మోనటరింగ్ గ్రూపు పోర్టల్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేసీ నిషాంతి పాల్గొన్నారు. సాంకేతిక నిపుణుడు రోహన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాకు నోడల్ అధికారిగా జేసీని నియమించారన్నారు. ఐటీ అధికారిగా జీఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ సువిజయ్‌ను నియమించారు. ప్రాజెక్టుల ఏర్పాటు, వాటి పర్యవేక్షణతో పాటు వేగవంతంగా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నేతృత్వంలో మోనిటరింగ్ గ్రూపు పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రాజెక్టు పర్యవేక్షణ గ్రూపునకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారని, వివిధశాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణలో ఈగ్రూపు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రూ.50కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన పెట్టుబడులను ఈగ్రూపు పర్యవేక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, సాంకేతిక నిపుణులు విజయ్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు రోటరీ సేవలు

రాజోలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు రోటరీ సేవలు అందిస్తుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా రాజోలులో డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ రోటరీ సేవా మందిరంలో రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా రోటరీ 220దేశాల్లో ఉందని, 44వేలు రోటరీ క్లబ్‌లు ఉన్నాయన్నారు. దేశంలో 11ఏళ్లుగా పోలియో కేసులు లేవని, ప్రపంచ వ్యాప్తంగా రోటరీ రూ.14వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంప వేమా, కార్యదర్శి కోదాటి సోమరాజు, సోమిశెట్టి ఆంజనేయులు, బొరుసు వెంకటతిరుమలరావు, దార్ల పెదబాబు, నామన షణ్ముకరావు, కసుకుర్తి రామకృష్ణ, మొహిద్దీన్‌కిష్వర్, కంచర్ల బాబి, లక్కింశెట్టి బాబులు, యేడిద కవీంద్ర, నానాజీ, అడబాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి వ్యాఘ్రేశ్వరం గొల్లగుంట వద్ద నిర్మించిన ఆలయంలో కోదండరామచంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ శిఖ, శిలాధ్వజస్తంభం, గణపతి, ఆంజనేయ శిలా విగ్రహాల ప్రతిష్ఠను శ్రీనివాసుల విజయ్‌గోపాలచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, కళావాహన, గోదృష్టి, శాంతికల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పార్వతీ రాజేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మాచవరంలో శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాత్రి వేదమంత్ర, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. అశేష భక్తజనం స్వామివారి కల్యాణం తిలకించారు. ఐదు రోజులు కల్యాణోత్సవ పూజలు నిర్వహిస్తామన్నారు. 15నస్వామివారి పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాన్నారు

భాగిర్తమ్మ జాతర మహోత్సవాలు

ఉప్పలగుప్తం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చినగాడవిల్లిలో బద్రి వంశీయుల ఆధ్వర్యంలో భాగిర్తమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మూడు రోజుల జాతరనిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మిడివరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో జిల్లాలోని మహిళా ఉద్యోగుణిలంతా పాల్గొని హక్కుల కోసం నినాదాలు చేశారు. మంగళవారం విజయవాడలో జరిగే దీక్షలో సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొని నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. జేఏసీ సభ్యులు వి.వెంకటరమణ, సుబ్బు, కిశోర్, సమగ్రశిక్ష ఉద్యోగిణులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కుసుమవారిపేట కాలనీవాసులు

అమలాపురంటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటును రద్దు చేయాలంటూ మాచవరం గ్రామస్తులతో పాటు వివిధ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఇటీవల కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణం ఒకటి అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కుసుమవారి పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి సమీపంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడంతో ఆయా ప్రాంతాలకు చెందినవారు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రార్థనా మందిరాలు ఉన్నాయని, అయినా మద్యం షాపు ఏర్పాటుకు చర్యలు చేపట్టిన తీరును వారు నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి అర్జీ అందజేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, మెండి డేవిడ్ అంబేడ్కర్, జల్లి శ్రీనివాసరావు, మాచవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 443 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం జిల్లా అంతటా ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు సిటింగ్ స్క్వాడ్‌లు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. డీఐఈవో సోమశేఖరరావు మలికిపురంలోని ఏఎఫ్‌డీటీ, శ్రీదీప్తి జూనియర్ కళాశాల, రాజోలు రెసిడెన్షియల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 443 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ ఇంటర్మీడియట్‌కు సంబంధించి 8,955 మంది విద్యార్థులకు 8,677మంది హాజరుకాగా 278మంది గైర్హాజరయ్యారు. గణితం-బి పరీక్షకు 6,899మందికి 6713మంది, జంతుశాస్త్రం పరీక్షకు 1,807మందికి 1742 మంది, చరిత్ర పరీక్షకు 249మందికి 222మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ ఇంటర్మీడియట్ విభాగంలో 2,397మందికి 2,232మంది హాజరుకాగా 165మంది గైర్హాజరైనట్టు సోమశేఖరరావు తెలిపారు.

లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ

అమలాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమలాపురం జాతీయ రహదారిపై అమలాపురం మహిపాలవీధిలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో హుండీని ఆదివారం రాత్రి చోరీ చేశారు. ఆలయ పూజారి సాయికృష్ణ పూజలు చేసిన అనంతరం ఆలయానికి తాళాలువేసి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి బయట ఉన్న హుండీని పగులకొట్టి నగదును చోరీ చేసినట్టు గుర్తించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ కిశోర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. హుండీలో వేలాది రూపాయల ఆదాయం ఉన్నట్టు ఆలయకమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ముమ్మిడివరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయంల ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు పేర్కొన్నారు. ఐదు కంపెనీల్లో 150కుపైగా ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ యూ.శ్రీదేవి సెల్:8341648470 లేదా డీపీవో కె.రాజేంద్ర, 8247645389ను సంప్రదించాలన్నారు. జిల్లాలోని పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసి, పీజీ విద్యార్హత గలవారు అర్హులన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

మలికిపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈనెల14న చిత్రాడలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేయడంలో ప్రతీ ఒక్కరు కీలక పాత్ర పోషించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం విశ్వేశ్వరాయపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, గన్నవరం, రాజోలు నియోజకవర్గాల నుంచి 15వేల నుంచి 16వేల మంది జనసైనికులు, వీర మహిళలు హాజరుకానున్నట్టు సమాచారం ఉందన్నారు. వీరందరికీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సభ విజయవంతానికి గ్రామ, మండల స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటుచేశామని, ఈనెల12న నియోజకవర్గ స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ వైఖరికి నిరసనగా మోటారుసైకిళ్లతో ర్యాలీ

అల్లవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు చమురు సహజవాయు నిక్షేపాలు తరలించుకుపోతూ ఓడలరేవు గ్రామ అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నిరసనగా కూటమి ఆధ్వర్యంలో ఓడలరేవు నుంచి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ నుంచి అమలాపురం కలెక్టర్ కార్యాలయం వరకు మోటారుసైకిళ్లపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓడలరేవు గ్రామస్తుల డిమాండ్లపై కలెక్టరుకు వినతిపత్రం సమర్పించామని దెందుకూరి తెలిపారు. కొల్లు విష్ణుమూర్తి కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, మంతెన సురేష్‌రాజు, పచ్చిమాల ఏడుకొండలు, ఇల్లింగిశ్రీను, పెమ్మాడి వెర్రియ్య, వాతాడి వెంకటేశ్వర్లు, పెమ్మాని వెంకటరామారావు, గ్రామస్తులు, మహిళలుర్యాలీలో పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే భూమిపూజ

అంతర్వేది, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో రానున్న వేసవి నుంచే ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడటానికి అవసరమైన చోట విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం భూమిపూజ చేశారు. విద్యుత్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు గుండుబోగుల పెద్దకాపు, రాపాక రమేష్‌బాబు, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జినాయుడు, దెందుకూరి శ్రీహరిరాజు, పోతురాజు కృష్ణ, వీరామల్లిబాబు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌కు నిరసనగా రిలే దీక్షలు

అమలాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్‌చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని నినాదాలు చేశారు. దీక్షలో జేఎస్ నందం, యూడీ రావు, పీవీఎల్ఎన్ వర్మ, ఏఎస్ నారాయణ పాల్గొన్నారు. ఆర్టీసీ యాజమాన్య తీరును నిరసిస్తూ ఏపీఎస్ ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు హౌలియా, డిపో కార్యదర్శి పి.మణిరాజు, కె.రంగప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో సీఆర్ఎంటీలు కీలకపాత్ర పోషించాలని బాధ్యతలు పూర్తి నిబ్బదతతో నిర్వర్తించాలని డీఈవో సలీంబాష సూచించారు. ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి రాంబాబు అధ్యక్షతన జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సీఆర్ఎంటీలు, మండల అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీఈవో మాట్లాడారు. సీఆర్ఎంటీలు పాఠశాల సందర్శనలో నిర్లక్ష్యం చూపకూడదని, ప్రతీ అంశంపై పూర్తి అవగాహనతో సమగ్ర పాఠశాల పనితీరును పర్యవేక్షించాలన్నారు. సీఆర్ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఎంఎస్‌ల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. సమగ్రశిక్షఫైనాన్స్‌అంకౌట్ అధికారి ప్రవీణ్‌కుమార్‌పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణ

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. టైలరింగ్‌లో నిష్ణాతులైన వారితో 45 లేదా 60 లేదా 90 రోజుల్లో బీసీకార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు మంజూరు చేస్తామన్నారు. నగర పంచాయతీ 20వార్డుల్లో ఆసక్తి గల మహిళలు వారి సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. టైలరింగ్ సెంటర్లను గుర్తించిన తరువాత వారికి శిక్షణ ఇస్తామన్నారు.. 18నుంచి 50 ఏళ్లలోపు వారు బియ్యం,రేషన్‌కార్డు, కమ్యూనిటీసర్టిఫికెట్ ఉండాలన్నారు.

ఎంపీటీసీ సాయిబాబుకు సతీ వియోగం

పి.గన్నవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కుందాలపల్లి గ్రామజనసేన ఎంపీటీసీ పప్పుల సాయిబాబు భార్య రామలక్ష్మి అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. రామలక్ష్మి మృతదేహానికి ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించి, సాయిబాబుకు ధైర్యం చెప్పారు.

పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మామిడికుదురు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన నయినాల తమ్మారావు, హైమావతి దంపతులు కర్తలుగా పాల్గొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మాకనపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅనంతలక్ష్మి భూదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల19 వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. సోమవారం ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు వ్రతం ఆచరించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దింట్లమ్మ గ్రామోత్సవం

మామిడికుదురు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామశివారు తోటమెరకలో వేంచేసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి గ్రామోత్సవాన్ని సోమవారం భక్తులు ఘనంగా జరిపారు. అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ప్రభ ఉత్సవాన్ని మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం అమ్మవారి కల్యాణంతో పాటు కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ముడుపులు, మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గాడిలంకలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ యాజమానులు పిండి లక్ష్మణమూర్తి-సరోజ, కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు-సత్యవేణి, తాడి తరుణ్‌సుబ్రహ్మణ్యం-సాయిదుర్గ దంపతులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ప్రతిష్ఠ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, దీక్షాధారణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సర్పసూక్త సుబ్రహ్మణ్య హోమ కార్యక్రమాలు నిర్వహించారు.

సీతారామలక్ష్మణ, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ

అయినవిల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీసీతారామ లక్ష్మణహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. యలకల్లంలో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠలు జరిగాయి. సోమవారం ఉదయం యాగశాల ప్రవేశం, గోపూజ, అఖండ దీపారాధన, రక్షాబంధనం, దీక్షారాధన, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహారాధన, మృత్తికా సంగ్రహణ, అంకురార్పణ, మూర్తి హోమం, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. 12న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తానన్న హామీని నిలుపుకోవాలి



నడిపూడి కల్యాణ మండపం వద్ద దండోరా నాయకుల సమావేశం

అమలాపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గడచిన సార్వత్రిక ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ కేటాయిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కోనసీమ జిల్లా మాదిగ దండోరా నాయకులు డిమాండ్ చేశారు.నడిపూడి శ్రీబాబూజగ్జీవన్‌రామ్ భవనంలో సోమవారం కూటమి దండోరా నాయకుల సమావేశం ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి ఆశీర్వాదం అధ్యక్షతన జరిగింది. మాదిగలకు ఎమ్మెల్సీ ఇచ్చి న్యాయం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. దండోరా సీనియర్ నాయకులు గంపల సత్యప్రసాద్ మాదిగ, ఎం.సత్యనారాయణ, ఖండవిల్లి ఏలియా, నేదునూరి నతానియేలు, తొత్తరమూడి ప్రభాకరరావు, ఆకుమర్తి రమేష్, చెయ్యేటి శ్రీను, చుట్టుగుళ్ల శ్రీను, సత్తాల దుర్గారావు పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

పి.గన్నవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం కలెక్టరేట్ వద్ద ఈనెల12న చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో సోమవారం జరిగిన వైసీపీ సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రోజు ఉదయం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం కావడంతో స్థానిక అక్విడెక్టు వద్ద వేడుకలు నిర్వహించుకుని అనంతరం అమలాపురం తరలివెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, బూడిద వరలక్ష్మి, నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, పితాని నరసింహరావు, దొమ్మేటి శివరామ్, యన్నాబత్తుల తాతాజీ, వాసంశెట్టి తాతాజీ, కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శివారు పంట భూములకు సైతం ప్రస్తుత సీజన్‌లో సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల ప్రతినిధులు సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వివరించారు. ఆయిల్ ఇంజన్ల ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని పంట పొలాలకు అందించే విధంగా చూడాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, డ్రైన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, రాజోలు, అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మళ్ల, అయినవిల్లి, అవిడి డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు పినిశెట్టి వెంకటస్వామి, దాట్ల వెంకటరాజగోపాలరాజు, రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), దంగేటి వెంకటరెడ్డినాయుడు, ఆకాశం శ్రీనివాస్, చిలూపూరి సుబ్బరాజు, కాకర శ్రీనివాస్, చవల జగన్నాథం, చొల్లంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పి.గన్నవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం వద్ద ప్రమాదవశాత్తు కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. సోమవారం ఉదయం రాజోలు నుంచి నిడదవోలు వెళ్తున్న కారు తాటికాయలవారిపాలెం వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కాల్వ చెంతన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

న్యాయవాది మృతి

ముమ్మిడివరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరానికి చెందిన న్యాయవాది గుత్తాల ఈశ్వరరావు(62) అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య కుమారి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈశ్వరరావు మృతికి న్యాయవాదుల సంఘం, పలువురు నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మలికిపురంలో చెత్త సేకరణ

మలికిపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మలికిపురం పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త సేకరణ చేపట్టినట్టు ఎంపీడీవో వి.మల్లికార్జునరావు తెలిపారు. మలికిపురంలో పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకున్నామని, గ్రామాల్లో పొడి, తడి చెత్తను సేకరిస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలు

కాట్రేనికోన, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాయితీపై రైతులకు యంత్రపరికరాలు ఇస్తున్నట్టు వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ తెలిపారు. ట్రాక్టర్‌తో నడిచే రోటవేటర్కు రూ.42,000, కల్టివేటర్ డిస్క్, డిస్క్ పడ్లర్ మౌల్డ్ బోల్డ్ నాగలి, లెవెల్ బ్లేడ్స్, బండ్ ఫార్మర్, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రమ్స్‌పై రూ.27,700 రాయితీ ఉందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్స్‌పై రూ.1000 రాయితీ ఇస్తున్నామన్నారు. పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్‌కు రూ.8,000, పవర్ టిల్లర్స్‌కు రూ.1,00,000 రాయితీ ఉందన్నారు. కావలసిన రైతులు ఈనెల 12వతేదీలోగా పాస్ బుక్, ఆధార్ కార్డుతో సమీప రైతు సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల హెడ్‌క్వార్టర్ విద్యుత్ సరఫరాకు 11కేవీ కొత్త లైన్ వేస్తున్నట్టు అమలాపురం ఈఈ రవికుమార్ సోమవారం తెలిపారు. మంగళవారం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రైల్వే పనుల వేగవంతానికి రైతులు సహకరించాలి

అయినవిల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను పనులు వేగవంతం అయ్యేలా రైతులు సహకరించాలని కొత్త పేట ఆర్డీవో పి.శ్రీకర్ రైతులను కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రైల్వే నిర్మాణానికి భూములు అవసరమైన రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమస్యలను రైతులు ఆర్డీవోకు వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తహశీల్దార్ నాగలక్ష్మ్మ, రైతులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయానికి విరాళం ఇస్తున్న దాతలు

ఆలమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఆలమూరుకు చెందిన ఒక దాత రూ.1,00,116 విరాళం ఇచ్చారు. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఆలమూరుకు చెందిన సబ్బిశెట్టి తుకారామ్ కుమారులు నాగేశ్వరరావు, రాంబాబు, రాజా తదితరులు గ్రామ పెద్దల సమక్షంలో విరాళం అందించగా, దాతలను గ్రామస్తులు అభినందించారు.

కోదండరామస్వామి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మండపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వై.సీతానగరంలో శ్రీకోదండరామస్వామి 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. దాతల సహకారంతో కొత్తగా నిర్మించిన మండపంలో అంకురార్పణ, రాత్రి స్వామివారి కల్యాణాన్ని జరిపారు. స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కె.సంగరాజు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన బంగారు కిరీటం, వెండి పాదుక లను ఇచ్చారు. స్వామివారికి రథంతో పాటు పల్లకీని అందించారు. భీమవరానికి చెందిన కనుమూరి కుసుమ కుమారి కుటుంబ సభ్యులు శ్రీరామచంద్రులవారికి రూ.లక్ష విలువ చేసే వెండి వక్షస్థలం కవచాన్ని అందించారు. స్వామివారి ఉత్సవాలకు స్థానికులతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వేడు కల్లో పాల్గొన్నారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.87 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,87,282 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

ఆత్రేయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. సోమవారం రాత్రి 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహ వచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను జరిపారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణా న్ని ఘనంగా నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో స్వామివార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపారు.



విశ్వేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో స్వామివార్ల కల్యాణం

ద్రాక్షారామ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో ఉన్న బాలా త్రిపుర సందరి సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్ల కల్యాణాలను సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. సాయంత్రం అం కురార్పణ, ధ్వజారోహణం, నిత్యోపాసన, బలిహరణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంత రం కల్యాణం తంతును ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ జరిపారు. రాత్రి 8.28 గంటల సమయంలో మాంగల్యధారణ అనం తరం తలంబ్రాలు, తదనంతరం నీరాజన మంత్రపుష్పం జరిపారు. కల్యాణోత్సవాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, అర్చకులు రావూరి వెంకట నారాయణ, అంగర విజయవెంకట సూర్యనారాయణా చార్యులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



అంగరలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంగరలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు పెద్దింటి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు, పెద్దింటి ప్రసన్న కుమార్ భార్గవాచార్యులు ఆధ్వర్యం లో ఆలయ అర్చకుడు ఎస్ఎల్ఎన్‌బి శ్రీనివాసాచార్యులు తదితరులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, బాలభోగము, నిత్యహోమాలు, బలిహరణ తదితర కార్యక్ర మాలను జరిపారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి పలువురు మహిళలు నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పోలేరమ్మను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరులో శ్రీ పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులను చెల్లిం చారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని పలువురు వేద పండితుల మంత్రాల మధ్య ఘనంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తు లతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0లో భాగంగా సారా తయారీ, విక్రయ స్థావరాలపై సోమవారం దాడులు జరిపారు. ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో రాజవరం లంకలోని గోదావరిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.

పని భారం తగ్గించరూ...

పంచాయతీ కార్యదర్శుల వినతి

ఆలమూరు, మార్చి 10(ఆంధ్రజోతి): పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజుకు సోమవారం పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శుల మండల సమాఖ్య అధ్యక్షురాలు వి.వేణు అధ్యక్షతన కార్యదర్శులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. పనిఒత్తిడి కారణంగా అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు పని ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్య దర్శుల పనులతోపాటు అదనపు బాధ్యతల వల్ల పని ఒత్తిడికి గురవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల అధికారికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం ఇచ్చారు. మండపేట మండల పరిషత్ అధికారి సత్యనారాయణ మూర్తికి పంచాయతీ కార్యదర్శుల సంఘ తరఫున అనిల్‌కుమార్ తదితరులు వినతి పత్రం ఇచ్చారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల పనిభారం తగ్గించాలని మండలంలోని కార్యదర్శులు సోమవారం ఈవో పీఆర్‌డీ గౌరీకుమారి, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెంట్ సురేంద్ర రెడ్డికి వినతిపత్రం అందించారు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో వివిధ రకాల సర్వేలు చేయిస్తున్నది. ఇందులో భాగంగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎం.చంటి, ఎస్.సుబ్బారావు, సత్యనారాయణ, గౌతమి, లక్ష్మి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.





కె.గంగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు. పక్క చిత్రంలో మండపటలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

నేత్రపర్వంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఉదయం పల్లకీసేవ, రాత్రి గరుడ వాహనోత్సవం నిర్వహించారు. వీటి ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి రవిచంద్రను అభినందిస్తున్న మంత్రి సుభాష్


బలహీన వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి సుభాష్ అన్నారు. ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యత కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు బీసీల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీలుగా ఎంపికైన కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బి.టి.నాయుడులకు మంత్రి అభినందనలు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర పీహెచ్‌సీలో సోమవారం 21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు జరిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో పరీక్షలు జరిపి మందులు అందించారు. వీరిలో 4 మందిని క్లిష్టతర గర్భిణులుగా గుర్తించి కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి రిఫరల్ చేసినట్లు తెలిపారు. క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సురక్షిత ప్రసవం, తల్లిబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, హెచ్ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్ హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో అఖిల

పీజీఆర్ఎస్‌లో 10 దరఖాస్తులు

ద్రాక్షారామ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో 10 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో అఖిల తెలిపారు. ఆక్రమణల తొలగింపుకోరుతూ 5, 22 ఏ నిషేదిత జాబితా నుంచి తొలగించాలని 1 దరఖాస్తు, రీసర్వే విస్తీర్ణం తక్కువ నమోదుపై 1 దరఖాస్తు, పాసు పుస్తకం కోరుతూ 1, భూమి రికార్డులు మార్పు లేకుండా చూపాలని కోరుతూ 1 దరఖాస్తు, శ్రీదేవి మత్స్యకార సంఘం పసలపూడి వారికి పంచాయతీ నుండి లీజు ఇప్పించాలని కోరుతూ మరో దరఖాస్తు వచ్చిందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రాయవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ ఎన్.వెంకటరమణ, రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణ మూర్తి అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను, డాక్టర్ ప్రత్యూష్యను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మహిళానేత సుబ్బలక్ష్మి, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తదితరులతో పాటు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేటలో సోమవారం మహిళా దినోత్సవాన్ని జరిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన వేడుకలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణితోపాటు ఎఫ్ఎం రేడియో డైరెక్టర్ సత్య హాజరయ్యారు. తొలుత వారు కళాశాలలో ఏర్పాటు చేసిన నర్సరీ గార్డెన్‌ను సందర్శించి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఎం రేడియో డైరెక్టర్ సత్య, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అనూష మాట్లాడారు. కళాశాల బిగ్రేడ్ సాధించిన సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు అతిధులను సత్కరించారు.

'జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి'

మండపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో 14న జరిగే ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అధ్యక్షతన సూర్య కన్వెన్షన్ హాల్లో జరిగిన జనసైనికుల సమావేశానికి పలువురు నాయకులు హాజరయ్యారు. పార్టీ పరిశీలకుడు మదనపల్లికి చెందిన రాందాసు చౌదరి, జనసేన రాష్ట్ర నాయకుడు తాడి మోహన్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ చిత్రాడలో జరిగే సభను విజయవంతం చేయాలన్నారు. కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బి. శ్రీనివాస్ మాట్లాడుతూ పిఠాపురంలో జరిగే ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో జనసైనికులు తరలి రావాలన్నారు. సమావేశంలో పిఠాపురం సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.వీరభద్రరావు, ఉండమట్ల రామారావు, సరాకుల అబ్బులు, నామాల చంద్రరావు శ్రీమన్నారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయికి భారతరత్న ఇవ్వాలి

ద్రాక్షారామ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిపూలేకు భారతరత్న ఇవ్వాలని బీసీ సంఘాల నాయకుడు యాట్ల నాగేశ్వరరావు డిమాండు చేశారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ద్రాక్షారామలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల వద్ద సావిత్రిబాయి విగ్రహానికి యాట్ల నాగేశ్వరరావు, కొల్లపు కామేశ్వరరావు, పడిదడకల భీమశంకరం, గారేజు సూరిబాబు, వేమవరపు రాంబాబు, గంపల సోమరాజు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.బీమశంకరం, సూదంశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం జరిపారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బీసీసంఘ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కె.సత్యనారాయణ, శ్రీనివాస్, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారిత సాధ్యం



ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): మహిళా సాధికారిత టీడీపీతోనే సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. కొత్తపేట, వాడపాలెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భా వం నుంచి మహిళలకు ఆనాడు అన్న ఎన్టీఆర్ నిలబడితే నేడు సీఎం చంద్రబాబు అండగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా శిశుసంక్షేమం కోసం బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేసి వారికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

బకాయిలు చెల్లించకపోతే ఆస్తుల జప్తునకు వెనకాడం

మండపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు, ఆస్తిపన్నులు చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు చేసేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని మండపేట మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు బకాయిదారులను హెచ్చరించారు. మార్చినెలాఖరుకల్లా నూరు శాతం పన్నుల బకాయిలు వసూలు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. మండపేటలో పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలను నియమించామని ఆయన తెలిపారు. ప్రత్యేక వాహనం ద్వారా పన్నుల వసూళ్ల కోసం పట్టణంలో ప్రచారం చేస్తున్నామన్నారు.

తడిపొడి చెత్తపై అవగాహన: స్వచ్ఛ ఏపీలో భాగంగా క్లీన్ మండపేటను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పట్టణంలో ఆయన ఛైర్‌పర్సన్ రాణి, మున్సిపల్ కౌన్సిలర్‌తో కలిసి వార్డుల్లో ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బందితో పాటు ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సోము వీర్రాజును అభినందిస్తున్న సత్యానందం

సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ కేటాయించడంపై హర్షం

కొత్తపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ కేటాయించడం పట్ల ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందంతో పాటు పలువురు బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాష్‌నారాయణ, మద్దింశెట్టి శ్రీనివాసరావు, జొన్నాడ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): బీజేపీ తరఫున సోము వీర్రాజు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల రామచంద్రపురం బీజేపీ శ్రేణులు సంబరాలు జరిపారు. అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరిపారు. ఆయన్ను ఎంపిక చేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, కొట్టువాడ హరిబాబు, యాండ్ర బుల్లి అబ్బులు, నలాది సతీష్ నాయుడు, కుప్పెల సూర్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీనివాస్, చొల్లంగి రాంబాబు, సూర్య, ఆకేటి శ్రీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

ఆలమూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చెత్తే కదా అని చులకనగా చూడకండి దాన్నుంచి పంచాయతీకి ఆదాయాన్ని సృష్టించవచ్చునని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు, పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

రేపు దండు మారెమ్మ జాతర

రాయవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామస్తుల ఇలవేల్పు దండు మారెమ్మ జాతరను బుధ, గురువారాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వెంటూరులో నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం గరగల గ్రామోత్సవం, గారడీలు, శక్తివేషాలు, బాణసంచా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారికి వెండి కవచాన్ని అలంకరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జాతర నిర్వాహక కమిటీ సభ్యులు రిమ్మలపూడి వేణుగోపాలదొర, ముత్యాల వీరబాబు, గొడితి సత్యం తదితరులు పాల్గొన్నారు.

జాతరను సంప్రదాయబద్ధంగా జరుపుకోండి: అమ్మవారి జాతరను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు సూచించారు. రాయవరంలో ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ పలు సూచనలు చేశారు. జాతర సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



పూడికను తొలగిస్తున్న దృశ్యం

సాగునీటి కాలువల ఆధునికీకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రావులపాలెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగునీరు అందక బీటలు తీస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన గోపాలపురం నీటి సంఘం అధ్యక్షురాలు ఝైగాపుల పుష్పవతి కాలువ ఆధునీకరణపై దృష్టిసారించారు. ప్రధాన పంట కాలువ నుంచి పంట పొలాలకు సాగునీరు పారే పిల్ల కాలువలలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు చర్యలు సోమవారం చేపట్టారు. వీటి పనులను ఝైగాపుల గురవయ్యానాయుడు పర్యవేక్షణలో నిర్వహించారు.



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందిస్తున్న వాసంశెట్టి సత్యం

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ద్రాక్షారామ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 2వ వార్డుకు చెందిన డిగ్రీ విద్యార్థి అభిషేక్‌కు సోమవారం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరఫున ల్యాప్‌టాప్ అందించారు. డిగ్రీ చదువుతూ యానిమేషన్ కోర్సు చేస్తున్న అభిషేక్‌కు ల్యాప్‌టాప్ అవసరమని తెలుసుకుని ఫౌండేషన్ ద్వారా సోమవారం విద్యార్థికి అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి కంప్యూటర్ బహూకరణ

కపిలేశ్వరపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి గ్రామానికి చెందిన ఫ్లూయింట్ గ్రిడ్ అధినేత గన్నమని శేషమురళీకృష్ణ సుమారు లక్షా 50వేలు విలువైన రెండు కంప్యూటర్ సిస్టమ్స్, 12 సీసీ కెమెరాలను బహూకరించారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అభ్యర్థన మేరకు వీటిని సమకూర్చినట్లు తెలిపారు. గతంలో దాత శేషమురళీకృష్ణ సీహెచ్‌సీకి ఆక్సిజన్ ప్లాంటు కూడా సమకూర్చారని ఆసుపత్రి అభివృద్ధికి సర్పంచ్ విజ్ఞప్తి మేరకు వీటిని సోమవారం అందించారన్నారు. దాతను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌లో తప్పులుంటే సరిచేసుకోవాలి

కె.గంగవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో 11,857 మంది రైతులు 15,794 ఎకరాల్లో పంట సాగు చేసినట్లు ఈ క్రాప్ నమోదు అయ్యిందని మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి అన్నారు. కె.గంగవరంలోని రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం ఈ క్రాఫ్ పబ్లికేషన్‌ను చేశారు. తప్పులు ఉంటే మూడు రోజుల్లో సరి చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.